క్లుప్తంగా

ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలి

ఆర్మూర్: విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి తన వైఖరి మార్చుకొని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంసాగర్ ప్రధాన కాలువతోపాటు వెంకటేశ్వరకాలనీ నుంచి పెర్కిట్ వరకు గల సబ్ కెనాల్ స్థలంలో పేదలు నిర్మించుకున్న ఇళ్లను తొలగించాలని మాట్లాడటం దుర్మార్గమని పేర్కొన్నారు. నాయకులు సూర్య శివాజీ, వెంకటేష్, మగ్దుమ్ పటేల్, సయ్యద్ ఇస్మాయిల్, ప్రతాప్, ఫరీద్, అలీ, సాయిరాం, వర్ధారెడ్డి, లతీఫ్, పాష, గౌస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



నందిపేట్(ఆర్మూర్): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి కోతలు ప్రారంభమయిన నేపథ్యంలో వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా జిల్లా నాయకులు గంగాధర్ కోరారు. మండలంలోని వెల్మల్ గ్రామంలో బుధవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతోపాటు బోనస్‌ను అందజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బైన చిన్న మల్లయ్య, రాజలింగం, ఉద్గిరి నర్సయ్య, బూస నల్లన్న, పెద్దరాజన్న పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



బోధన్: సాలూర మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ శశి భూషణ్, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. మందర్నా రవి, అల్లె జనార్దన్, బాల కృష్ణారెడ్డి, అల్లె రమేష్, రవి, పద్మారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, నాయకులు మొబిన్‌ఖాన్, సాయరెడ్డి, రాములు, జావీద్, కార్తీక్, కిరణ్, రాజు, పోచయ్య, సాయిలు, మోహన్, సాయిలు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



నవీపేట: మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదును పార్టీ మండల అధ్యక్షుడు ద్యాగసరిన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి కేంద్రంలో బీజేపీ చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు. వ్యాపార కూడళ్లలో సభ్యత్వాన్ని చేపట్టారు. ఇటీవల హర్యానాలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో స్వీట్లు పంచుకున్నారు. వెంకటరమణి, నాయకులు శ్రీధర్, సంతోష్, పిల్లి శ్రీకాంత్, ఆనంద్, రాజేందర్, ప్రవీన్, రాము పాల్గొన్నారు.

పడగల్‌లో..

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో బుధవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కిసాన్‌మోర్చా జిల్లా పార్టీ ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు నగేశ్, ప్రధానకార్యదర్శి భానుచందర్, బద్దం సురేష్, అంగం రమేశ్, ప్రవీణ్, రాజేందర్, మోహన్, రఘు, గంగాధర్, రాజారెడ్డి, శ్రీకాంత్, సురేష్, బాలు, కిషన్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణాభివృద్ధి కమిటీ (మహాలక్ష్మి ట్రస్ట్) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని మహాలక్ష్మి మందిరం కల్యాణ మండపంలో ఎన్నికల కమిటీ అధికారులు ఎన్నికలు నిర్వహించారు. హోరాహోరీగా ఎన్నికలు కొనసాగగా నూతన అధ్యక్షుడిగా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ గంగాధర్‌రావ్ పట్వారీ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బీర్కూర్ శంకర్, ఉపాధ్యక్షులుగా సూరలింగం, ఉద్మీర్ సాయిలు, సంయుక్త కార్యదర్శిగా ఈరవురం చిన్న పోశెట్టి ఎన్నికయ్యారు. మరో 8మంది ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా బరిలో నిలిచి విజయం సాధించారు. నేడు వారు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

దోమల నివారణకు చర్యలేవి?

- ఆర్మూర్‌లో తూతూమంత్రంగా ఫాగింగ్
- అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఆర్మూర్‌లోని మల్లారెడ్డి చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. దీంతో దోమల వ్యాప్తి విపరీతంగా పెరగడంతో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలవుతున్నారు. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రికి ప్రతిరోజు 300నుంచి 400మంది వరకు జ్వరంతో వెళుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

కొన్ని వార్డులకే..

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 36 వార్డులు ఉండగా ఆయా వార్డుల్లో ఫాగింగ్ చేయాల్సి ఉంది. కానీ ఎప్పుడో అప్పుడు ఏదో ఒక వార్డులో అలా చేసి వెళ్లిపోతున్నారు. దీంతో దానివల్ల ఎటువంటి ప్రయోజనం లేదని, వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేయాలని పలువురు పేర్కొంటున్నారు. కొన్ని వార్డుల్లో మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారని, మిగతా వార్డులో చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో దోమల నివారణకు, దోమల మందు పిచికారి, గంబోసియ చేపలను నిల్వ ఉన్న నీటిలో వదలడం, ప్రతిరోజు సాయంత్రం ఫాగింగ్ వంటివి చేపట్టాలి. కానీ అలా కాకుండా ప్రధానమైన కూడళ్లో మాత్రమే ఫాగింగ్ నిర్వహించి వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





హుస్నాబాద్ కాలనీలో రోడ్డుపక్కన చెత్తాచెదారం.. పట్టణంలోని రహదారిపై నిలిచిన వర్షపునీరు

చర్యలు తీసుకుంటాం..



ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. దోమల మందు పిచికారి, ఫాగింగ్ చేస్తున్నాం. ఫాగింగ్ ప్రతి వార్డులో చేయాలని మున్సిపల్ జవాన్లకు సూచించాం. దోమల నివారణకు చర్యలు చేపడుతాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

తులం బంగారం హామీని నెరవేర్చాలి

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- పలు మండలాల్లో కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/బాల్కొండ/వేల్పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10నెలలు అవుతున్నా ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్షతో పాటు, తులం బంగారం ఇస్తామన్నా హామీ నెరవేర్చలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బుధవారం మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆసరాగా ఉండటానికి ఒక మేనమామ కట్నంగా కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రారంభించారని వెల్లడించారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే రూ. లక్ష ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం ఇస్తాం అని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇస్తున్న చెక్‌లు చాలామటుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే జరిగిన వివాహాలేనని, వీరందరికి రూ. 1లక్షతో తులం బంగారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ దసరా పండుగకు పేదింటి ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చీరలు పంపిణీ చేయలేదన్నారు. హామీలను సక్రమంగా అమలు చేయకుండా రూ.1,50,000 కోట్లతో ఎవరికి పనికిరాని మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటున్నారన్నారు. అలాగే వేల్పూర్, బాల్కొండ మండలాల్లోనూ ఎమ్మెల్యే పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, పీఏసీఎస్ చైర్మన్‌లు రేగుంట దేవేందర్, కుంట ప్రతాప్‌రెడ్డి, నాయకులు రవి, రఫీ, శేఖర్, జైడీ శ్రీను పాల్గొన్నారు.

సీఎం ఫొటో పెట్టలేదని కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

కమ్మర్‌పల్లిలో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టలేదని కాంగ్రెస్ నాయకులు అధికారులను నిలదీశారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని సీఎం ఫొటోతో పాటు తన ఫొటో కూడా పెట్టాల్సిందని వ్యాఖ్యానించారు. ఇలాంటి పొరపాటు మరోసారి జరగకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

కాన్షీరాంకు ఘన నివాళి



మాక్లూర్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు



బాల్కొండ మండల కేంద్రంలో..

బాల్కొండ/మాక్లూర్: బాల్కొండ మండల కేంద్రంలో బుధవారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మాన్య శ్రీ కాన్సీరాం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షుడు మాల లింగన్న మాట్లాడుతూ..అనగారిన వర్గాల రాజకీయ దిక్సూచి, పేద ప్రజల ఓటు శక్తితో రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు మహోన్నత నాయకుడు మాన్యవర్ కాన్షీరాం అని అన్నారు. ఆయన త్యాగమయ పోరాట జీవితం నేటి యువ రాజకీయ తరానికి ఎంతో ఆదర్శనీయమైనదన్నారు. అలాగే మాక్లూర్ మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు క్లోం భోజన్న కాపు, గంగాప్రసాద్, వడ్ల రాజేశ్వర్, సల్ల నర్సయ్య, దాసు, రవి పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



ఆర్మూర్‌టౌన్: హర్యానా రాష్ట్రంలో మూడోసారి బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకోవడం, జమ్మూకాశ్మీర్‌లో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించడంపై ఆర్మూర్ బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం బీజేపీ నాయకులు స్వీట్లు తిని పించుకున్నారు. నాయకులు జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలన్నారు. పులి యుగంధర్, దోండి ప్రకాష్, మిరియాల్కర్ కిరణ్, కలిగోట ప్రశాంత్, భాసెట్టి రాజ్‌కుమార్ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో స్థానిక రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా కబడ్డీ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. నాగంపేట్ జట్టు విజేతగా నిలిచిందని అన్నారు. విజేతకు రూ.10 వేల నగదుతో పాటు షీల్డ్‌ను, రన్నర్‌గా నిలిచిన బాల్కొండ జట్టుకు రూ.5 వేల రూపాయలను అందజేశారు. మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, మాసం గోపి, రెడ్డీస్ యూత్ సభ్యులు లోక సుభాష్, ప్రశాంత్ రెడ్డి, ముస్కు శ్రీను, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

సాలూర మండలంలో...

బోధన్: సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. సాలంపాడ్ క్యాంప్‌లో క్రీడామైదానం ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. పేరం దయాకర్‌రెడ్డి జట్టుపై కామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జట్టు విజయం సాధించిందన్నారు. విజేతలకు బహుమతులు త్వరలో అందజేస్తామన్నారు. జస్వంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రామిరెడ్డి, మారం బ్రహ్మతేజా రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



వర్ని: మండలంలోని హుమ్నాపూర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం గ్రామపంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గత వారంరోజులుగా గ్రామంలో తాగునీరు సరఫరా కావటం లేదన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్తం

ఘనంగా పోస్టల్ డే



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఘనంగా పోస్టల్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా పోస్ట్‌మాన్ గుండా శ్రీనివాస్‌ను సత్కరించారు. చెరుకు పృథ్వీరాజ్, అంబల్ల తిరుపతి, గుర్రం విజయానంద్, సురేందర్, సునీల్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్‌ను స్వాగతిస్తున్నాం

ఆర్మూర్‌టౌన్: ఎస్సీ వర్గీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించి ఏకసభ్య కమిషన్ వేయడాన్ని స్వాగతిస్తున్నామని మాదిక సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికైన మాదిగలు సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు మాని అండగా నిలవాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆర్మూర్‌టౌన్: విద్యుత్ మరమ్మతల కారణంగా ఆర్మూర్ పట్టణంతోపాటు పెర్కిట్, మామిడిపల్లిలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ డీఈ హరిచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

బెంచీల వితరణ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంతో పాటు, బషీరాబాద్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో బషీరాబాద్ గ్రామానికి చెందిన గణేష్ ఎలక్ట్రికల్స్ యజమాని గణేష్ బుధవారం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 12 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు రఫీ, సింగిరెడ్డి శేఖర్, తిప్పిరెడ్డి శ్రీను, జైడీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం

మోర్తాడ్/వేల్పూర్: ఏర్గట్ల మాజీ ఎంపీటీసీ మధు-సంధ్యారాణిల కూతురు శ్రీవర్షిణి ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈసందర్భంగా బుధవారం శ్రీవర్షిణిని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సత్కరించారు. రాజాపూర్ణనందం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కేటగిరీలో మూడో ర్యాంకు

ఎడపల్లి(బోధన్): మండలంలోని బాపునగర్ గ్రా మానికి చెందిన నాగనూరి విజయ్ కుమార్ డీఎస్సీ పరీక్షలో ఎస్సీ విభాగంలో మూడో ర్యాంకు సాధించాడు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. విజయ్ కుమార్ మూడో ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల తనిఖీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో బుధవారం రవాణ, ట్రాఫిక్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎంవీఐ వివేకానంద్‌రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులకు హెల్మెట్, ధ్రువీకరణ పత్రాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమాన విధించారు. ట్రాఫిక్ సీఐ రమేష్, ఎస్ఐ గంగాధర్, ఏఎస్ఐ చిన్నయ్య పాల్గొన్నారు.

సరస్వతీమాత.. నమస్తుభ్యం





కోనసముందర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి.. నందిపేటలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సరస్వతి అమ్మవారిగా భక్తులకు దుర్గామాత దర్శనమిచ్చింది. ఈసందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే పలు మండపాల వద్ద అన్నదానాలు, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌లో అమ్మవారికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



బాల్కొండలో చిన్నారులకు అక్షరాభ్యాసం



ఆర్మూర్‌లో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



ఆర్మూర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బోధన్ పట్టణంలో..



నవీపేటలో చిన్నారులకు అక్షరాభ్యాసం



కాల్‌పూర్‌లో అమ్మవారికి ఓడిబియ్యం పోస్తున్న భక్తులు

బల్దియాలో బతుకమ్మ వేడుకలు



ఆర్మూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బర్దీపూర్ గ్రామంలో..

ఆర్మూర్ టౌన్: పట్టణ మున్సిపల్ ఆధ్వర్యంలో బుధవారం జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకని, మహిళలకు పెద్ద పండుగ అన్నారు. రేగుల్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బర్దీపూర్‌లో..

బోధన్‌రూరల్: మండలంలోని బర్దిపూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రధాన కూడలిలో బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. వీడీసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	బహిర్భూమి (తెలుగు) - 10.50, మిస్టర్ సెలెబ్రిటీ (తెలుగు) - 1.30, చిట్టిపొట్టి - 4.15, జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్) - 7.15, సత్యం సుందరం - 10.30
స్క్రీన్-2	దేవర(తెలుగు)-11.00, 02.35, 6.10, 9.45
స్క్రీన్-3	కాళీ (తెలుగు) - 11.05, జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్) - 1.15, దక్షిణ (తెలుగు) - 4.30, దేవర - 7.00, రామ్‌నగర్ బన్నీ - 10.35
స్క్రీన్-4	స్వాగ్ (తెలుగు) - 12.00, 3.20, 6.40, 10.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 - 12.55 4.10.
స్క్రీన్-2	దేవర పార్ట్-1 (తెలుగు)- 10.30, సత్యం సుందరం - 1.40 7.30, రామ్‌నగర్ బన్నీ -4.30 10.30
స్క్రీన్-3	స్వాగ్ (తెలుగు)- 10.25 1.30 7.30 10.30 దక్షిణ (తెలుగు)-4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 (తెలుగు)- 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-2	స్వాగ్(తెలుగు)-12.25 7.00, జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్)-3.45, సత్యం సుందరం(తెలుగు)-10.20
స్క్రీన్-3	జోకర్ ఫోలి ఏ డేయస్(ఇంగ్లీష్)-12.35 6.00 9.15 కాళీ(తెలుగు)- 3.50
స్క్రీన్-4	బహిర్భూమి (తెలుగు)-11.05, మిస్టర్ సెలెబ్రిటీ (తెలుగు)-1.45, చిట్టిపొట్టి (తెలుగు)-4.30, దక్షిణ (తెలుగు)-7.30, రామ్‌నగర్ బన్నీ (తెలుగు)-10.00
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	స్వాగ్ (తెలుగు)
నటరాజ్	సత్యం సుందరం (తెలుగు)
విజయ్	దేవర పార్ట్-1(తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,400	వెండి (కిలో)	94,500
22 క్యారెట్స్	72,335		

– నిజామాబాద్ బిజినెస్